క్లుప్తంగా

నేడు చిత్తూరులో బస్సుయాత్ర

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర గురువారం చిత్తూరుకు చేరుకుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్, గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం కొంగారెడ్డిపల్లెలోని హోటల్లో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలనడం నేరం

చిత్తూరు రూరల్: జీడీ నెల్లూరు ఎట్టేరి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని బెదిరించడం నేరమని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి మండిపడ్డారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం గ్రామంలో ఉండకూడదని, వెంటనే తొలగించాలని కొందరు ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



కల్లూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి బుధవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు క్రైం నంబర్లు వేయాలని ఆదేశించారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచారని అభినందించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

రూట్ ఫీడింగ్‌తో కొబ్బరి చెట్ల సంరక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న డింపు ప్రియ

కుప్పం రూరల్: తెగుళ్లుఆశించిన కొబ్బరి చెట్లను రూట్ ఫీడింగ్ (వేరుకు క్రిమి సంహారక మందు కలిపిన నీటిని పట్టించడం)తో సంరక్షించుకోవచ్చని కుప్పం మండల ఉద్యానవన శాఖాధికారి డింపు ప్రియ అన్నారు. తెగుళ్లు ఆశించిన కొబ్బరి చెట్లను కాపాడుకునేందుకు వెండుగంపల్లెలో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డింపు ప్రియ మాట్లాడుతూ, కొబ్బరిలో నల్లముట్టి పురుగు ఉధృతి ఎక్కువై, గొంగళి పురుగు దశలో ఉన్నప్పుడు వేరు ద్వారా మోనోక్రోటోఫాస్ 10మి.లీ./10 మి.లీ నీటిని కలిపి పట్టించాలన్నారు. బాగా పోషకాలు తీసుకునే వేరును 'వీ' ఆకారంలో పొట్టును చెక్కి, కలుపుకున్న మందును పాలిథిన్ కవర్‌లో పోసి, మందు పీల్చుకోవడానికి అనువుగా వేరును మందులో ముంచి కట్టాలన్నారు. తరువాత 45 రోజుల వరకు కొబ్బరి బోండాలు, కాయలు కోయరాదన్నారు. పురుగు సోకి ఎండిన తోటలకు కిలో యూరియా, 2 కిలోల సూపర్ పాస్ఫేట్ 2.1/2 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీరు పెడితే ఏడాది తరువాత చెట్లు కోలుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ కార్తీక్, మనోజ్, ఏపీఎం మురుగేష్, రైతులు పాల్గొన్నారు.

బొమ్మసముద్రం పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది విధుల నిర్వహణలను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. డెలివరీ కేసుల వివరాలను ఆరా తీశారు. ప్రసూతి విభాగంలో అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రాత్రి వేళల్లో వచ్చే కేసులపై తక్షణమే స్పందించాలని, అప్పుడే ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలని, వైద్యసేవలను అందించాలని ఆదేశించారు.

సింహ వాహనంపై అవనాక్షమ్మ

నారాయణవన: సముదాయంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించి సముదాయం పురవీధుల్లో విహరించారు.

ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు



ఎంపైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో రాగిజావ తాగేందుకు వెళుతున్న విద్యార్థులు



రుచిగా.. శుచిగా 'భోజనం'

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అదే క్రమంలో విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. మెనూ ప్రకారం రుచిగా.. శుచిగా ఆహారం అందించేందుకు కార్యచరణ అమలు చేస్తోంది. కొత్త కొత్త వంటకాలను వండి వడ్డించేందుకు సర్వం సమకూరుస్తోంది. జగనన్న గోరుముద్ద పథకం కింద ఇంటిని మరిపించేలా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. అలాగే పిల్లలకు బలవర్థకమైన రాగి జావ, చిక్కీలను పంపిణీ చేస్తోంది. ఈ మేరకు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం
- పకడ్బందీగా జగనన్న గోరుముద్ద
- హర్షం వ్యక్తం చేస్తున్న పిల్లలు.. తల్లిదండ్రులు

మండల సమాచారం

జెడ్పీ హైస్కూళ్లు :	07
ప్రాథమికోన్నత పాఠశాలలు :	04
ప్రాథమిక బడులు :	54
మొత్తం విద్యార్థులు :	3,180 మంది
మధ్యాహ్న భోజనం చేస్తున్నవారు :	2,995 మంది

ఐరాల : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందు కు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల ఆకలి బాధలు తీర్చేలా జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చింది. రోజుకో మెనూతో రుచికరమైన కాహారం అందించేందుకు కృషి చేస్తోంది. దీనికి తోడుఐరన్, కాల్షియం వంటి పోషకాలు కలిగిన రాగిజావను వారానికి మూడు రోజులు పంపిణీ చేసేలా మెనూలో చేర్చింది. మిగిలిన మూడు రోజు లు చిక్కీలు, ఐదు రోజులు కోడిగుడ్డు అందిస్తోంది. జగనన్న గోరుముద్దలో వారానికి 15 వెరైటీలు ఉండేలా చర్యలు చేపట్టింది. పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది.

గతంలో నాసిరకం

గత టీడీపీ ప్రభుత్వంలో పిల్లలకు నాసిరకమైన మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీలేని కూరలతో పథకాన్నే నీరుగార్చేశారు. విద్యార్థులు సైతం రోజూ ఒకే రకమైన సాంబారు అన్నం తినలేక నానా అవస్థలు పడేవారు.

నేడు షడ్రసోపేతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త మెనూను అమల్లోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు షడ్రసోపేతమైన ఆహారం అందించేలా మధ్యాహ్న భోజన పథకంలో వినూతన్న మార్పులు తీసుకువచ్చారు. 'జగనన్న గోరుముద్ద'ను ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు.

మెనూ ఇలా..

- సోమవారం : వెజ్ పులావ్, ఉడికించిన గుడ్డు, కూర, పొంగల్, చట్నీ, చిక్కీ
- మంగళవారం: రాగిజావ, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
- బుధవారం: కూరగాయాలతో అన్నం, బంగాళదుంప కుర్మా, చట్నీ, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం: రాగిజావ, వెజ్ పులావ్, చట్నీ, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకుకూర అన్నం, రాగిజావ, పప్పుచారు, ఉడికించిన గుడ్డు, స్వీట్ పొంగల్

చాలా రుచిగా ఉంటోంది



పాఠశాలలో అందించే మధ్యాహ్న పథకం భోజనం చాలా రుచిగా ఉంటోంది. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ఆనందంగా తీసుకుంటున్నాం. వారంతో ఐదు రోజులు కోడ్డి గుడ్డు, రోజుకో రకం కూరతో భోజనం వడ్డిస్తున్నారు. చాలా ఇష్టంగా తింటున్నాం.

– రూప, 10వ తరగతి విద్యార్థిని, ఐరాల

రాగిజావ ఇస్తున్నారు



పోషకాలతో కూడిన రాగి జావను ఇస్తున్నారు. మాకు ఇష్టమైన కోడిగుడ్డును సైతం అందిస్తున్నారు. నాతోపాటు మా స్నేహితులందరం చాలా సంతోషంగా మధ్యాహ్న భోజనం తింటున్నాం. అలాగే చక్కటి రుచితో ఉండే చిక్కీలను పంపిణీ చేస్తున్నారు.

– వంశీ, 9వ తరగతి విద్యార్థి, ఐరాల

జగన్ మామయ్యకు కతజ్ఞతలు



జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పాఠశాలలో పెడుతున్న భోజనం ఎంతో రుచిగా ఉంటోంది. నేను రోజు మధ్యాహ్న భోజనం తింటున్నా. నాడు–నేడు పథకంతో మా స్కూలులో అన్ని సదుపాయాలు కల్పించారు. నాణ్యమైన విద్యతోపాటు మాకు పౌష్టికాహారం అందిస్తున్న జగన్ మామయ్యకు కతజ్ఞతలు.

– భవిత, 8వ తరగతి విద్యార్థిని, ఐరాల

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారం అందిస్తున్నాం. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం సూచించిన మెనూను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం.

– రుషీంద్రబాబు, ఎంఈఓ, ఐరాల

పరిశ్రమల ఆధునికీకరణపై అవగాహన

చిత్తూరు అగ్రికల్చర్: ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలను ఆధునికీకరణపై జిల్లా పండ్ల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం చిత్తూరు కట్టమంచి బాలకృష్ణారెడ్డి భవన్‌లో గుజ్జు పరిశ్రమలదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆహార తయారీ పరిశ్రమలు పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమల్లో వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పండ్ల సమాఖ్య నాయకులు శివకుమార్, గోవర్ధన్ బాబీ, తలపులపల్లె బాబిరెడ్డి, గల్లా సోము పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కల్యాణ మండపం పక్కనే ఉన్న కాలువ తూముకు ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ తీగలు కట్టేశారు. రాత్రివేళల్లో భక్తులు ఈ విషయం గమనించక పొరపాటున వాటికి తగిలితే ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదముంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ స్తంభానికి తీగలను అమర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

యాదమరి : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. బుధవారం మాదిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని ఎంపీవై కాలనీ, నండుము ఇండ్లు, తాళ్లమడుగు గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు వివరాలతో కూడిన బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని కొనియాడారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్నకు అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో స్థానిక వీఆర్‌ఓపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్థానిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. రెవెన్యూ అధికారులు తమ తీరు మార్చుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మనోహరన్, పరంధామగౌడ్, కార్తీక్‌రెడ్డి, శేఖర్, కరుణాకరన్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

నేడు వరిగపల్లెలో గడప గడపకు..

వరిగపల్లె సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. అన్నిశాఖల మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని స్పష్టం చేశారు.

నా పెద్ద మనవడయ్యా..!



గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు అద్భుత అనుభవం ఎదురైంది. ఎంపీవై కాలనీలో ఆయన పర్యటిస్తుండగా ఓ వృద్ధురాలు ఎదుటపడింది. సంక్షేమ బుక్‌లెట్‌లోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను ఆమెకు చూపించి అవ్వా ఇందులో ఉంది ఎవరో తెలుసా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీనికి సదరు వృద్ధురాలు స్పందిస్తూ ఆ ఫొటోని వ్యక్తి మా పెద్ద మనవడు. నాకు ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్ వచ్చేలా చేశాడు.. ఆ బాబు మా ఆయుష్షు కూడా పోసుకుని వెయ్యేళ్లు బతకాలి అంటూ ఆశీర్వదించింది. వృద్ధురాలి సమాధానంతో ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రజల మనసు గెలిచిన ముఖ్యమంత్రి వెంట ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

వరసిద్ధుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం స్వామివారి పుష్కరణిని పరిశుభ్రం చేయించారు. అలాగే ఆలయంలోని సుపథ మండపంలో పెయింటింగ్ పనులు చేపట్టారు.





పుష్కరణి శుభ్రం చేస్తున్న కూలీలు, స్వామివారి సుపథ మండపంలో పెయింటింగ్ వేస్తున్న దృశ్యం

'శంఖారావం' కరపత్రాల విడుదల

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడలో ఈనెల 18న నిర్వహించనున్న అగ్రిగోల్డ్ శంఖారావం దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 32 లక్షల కుటుంబాల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన అగ్రిగోల్డ్ దొంగలను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, హబీబుల్లా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



చర్చివీధిలోని కృష్ణమందిరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



బంగారుపాళెం: విశేషాలంకారంలో కృష్ణభగవానుడు



రామాపురంలో స్వామివారు

చిత్తూరు రూరల్: నగరంలో బుధవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. హైరోడ్డు, చర్చివీధి, గిరింపేటలోని కృష్ణ మందిరాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు చిన్నారులు చిన్ని కృష్ణుడి అలంకారంలో ఆకట్టుకున్నారు. చర్చివీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో స్వామివారిని మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. అలాగే కన్నికాపురం, గొల్లపల్లె, వరదరాజులపల్లెలో అష్టమి పూజలను వైభవంగా జరుపుకున్నారు.

బంగారుపాళెం: మండల కేంద్రంలో ప్రబోద సేవా సమితి వారు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజావీధిలో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి కృష్ణభగవానుని ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సేవాసమితి సభ్యులు బాలాజీ, ధనుంజయ మాట్లాడుతూ గీతోపదేశం మానవాళికి మార్గదర్శకమన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న మొదిలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్

మొగిలి గోశాలలో..

మొగిలిశివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభువు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి మూలవర్లకు విశేషం అభిషేకం చేపట్టారు. అనంతరం మొగిలి దేవరకొండ వద్ద గోశాలలో గోపూజ నిర్వహించారు. గోమాత విశిష్టతను భక్తులకు వివరించారు.



బొమ్మసముద్రంలో దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు

గుడిపాల: మండలంలోని వసంతాపురం, గుడిపాల, మరకాలకుప్పం, బొమ్మసముద్రం, బసవాపల్లె, కోలావూరు, ముత్తువాళ్లూరు, చెరువు ముందరవూరు, 197రామాపురం, పిల్లారికుప్పం, బండపల్లె, చిత్తపారలోని ఆలయాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నియామకం



రామచంద్ర

శాంతిపురం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా కొలమడుగు పంచాయతీ రామాపురానికి చెందిన రామచంద్ర నియమితులయ్యారు. ఆయనకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రామచంద్ర చెప్పారు.